పరశురామ థీమ్‌పార్క్‌పై పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉడుపి జిల్లా కార్కళ తాలూకా ఉమికల్ కొండపై పరశురామ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసే థీమ్‌పార్క్‌లో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. కార్కళ తాలూకా నల్లూరు గ్రామానికి చెందిన కృష్ణ ఏ శెట్టి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం కొట్టివేసింది. ఇప్పటికే ఈ వివాదంపై సీఐడీ దర్యాప్తు జరుగుతోందని, ఈ దశలో హైకోర్టు జోక్యం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది.



గ్యారెంటీలకు ధోకా లేదు





- అన్నింటా ప్రగతే మా ఆశయం
- అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం
- కరువు సాయంపై సకాలంలో స్పందించని కేంద్రం
- వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం
- పరేడ్ మైదానంలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అన్ని విభాగాల్లోనూ ప్రగతి సాధించడమే తమ ఆశయమని, ఆ దిశగానే సంక్షేమాలు, అభివృద్ధి అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ విధానంతోనే ఎన్నికలకు ముందు ఐదు గ్యారెంటీలను ప్రకటించామని, రెండో ఏటా వాటిని విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. గ్యారెంటీలకు ఢోకా లేదని, భవిష్యత్తులోను కొనసాగుతాయని ధీమా వ్యక్తం చేశారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫీల్డ్ మార్షల్ మాణిక్ షా పరేడ్ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం, బెంగళూరు మహానగర పాలికె, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన భాగస్వాములయ్యారు. నేరుగా మైదానానికి చేరుకున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఓపెన్ టాప్ జీపులో అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మైదానం వేదిక నుంచి ప్రసంగిస్తూ ఐదు గ్యారెంటీలతో రాష్ట్రం దివాళా తీస్తుందనే విమర్శలకు దీటుగా సమాధానం చెప్పేలా రాష్ట్రంలో ఆర్థిక ప్రగతి సాధించి చూపామని తెలిపారు. మరిన్ని ఆవిష్కరణల ద్వారా లబ్ధిదారులకు ఎక్కువ సంక్షేమాలు చేకూరుస్తామని భరోసా ఇచ్చారు. శక్తి గ్యారెంటీ ద్వారా మహిళలు 271 కోట్ల ఉచిత టికెట్ల ద్వారా ప్రయాణించారని, వీటి విలువ రూ.6,541 కోట్లుగా ఉందన్నారు. అన్నభాగ్య గ్యారెంటీకి కేంద్రం బియ్యం ఇవ్వనందుకు ప్రతి నెలా నగదు బదిలీ చేస్తున్నామని అన్నారు. సామాజిక భద్రతలో భాగంగా వివిధ పథకాల ద్వారా రూ. 13,027 కోట్లు ఖర్చు చేశామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన గత ఏడాది తీవ్రమైన అనావృష్టి నెలకొందన్నారు. కేంద్రం నుంచి కరువు సాయం సకాలంలో అందకపోయినా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వమే అన్ని విధాల చర్యలు చేపట్టిందన్నారు. తాగునీరు, పశుగ్రాసంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజల కష్టాలు తీర్చామని చెప్పారు. ఈ ఏడాది అతివృష్టి తీవ్ర నష్టాన్ని కలిగించిందని, వరద బాధిత జిల్లాల్లో నిత్యం అధికారులు, ఇన్‌చార్జ్ మంత్రుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి శాశ్వతంగా నివాసం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు.



భరతమాత వేషధారణలో..

ప్రాంతీయ సమతుల్యతలో భాగంగా వెనుకబడిన కల్యాణ కర్ణాటక జిల్లాల సమగ్ర అభివృద్ధికి రూ.5వేల కోట్ల పనులు చేపట్టామన్నారు. బసవణ్ణ ఆశయాలకు అనుగుణంగా సమసమాజ నిర్మాణం రాజ్యాంగ ఆశయాలుగా ఉన్నాయని, వాటిని అమలు చేసే విషయంలో రాజీలేని రీతిలో పాలన సాగిస్తున్నామని అన్నారు. ప్రతి పౌరుడు దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన వారందరినీ స్మరించుకోవాలని, వారి ఆశయాలను పాటించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య అందరూ సంక్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్, నగర పోలీసు కమిషనర్ బి. దయానంద బెంగళూరు నగర జిల్లా అధికారి కేఏ దయానంద పర్యవేక్షణలో వేడుకలు సాగాయి.

250 అడుగుల పతాకంతో ఉత్సాహంగా ర్యాలీ




నగరంలో భారీ పతాకంతో ర్యాలీ

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని వియ్ వైశ్యా సంస్థ ఫౌండర్ అనిల్‌గుప్తా నేతృత్వంలో 250 అడుగుల జాతీయ పతాకం రెపరెపలాడింది. గాంధీబాజార్‌లో ర్యాలీని ఎంపీ తేజస్వీ సూర్య, ఎమ్మెల్యే ఉదయ్‌గరుడాచార్ ప్రారంభించారు. గాంధీబజార్ నుంచి రామకృష్ణ ఆశ్రమ సర్కిల్ మీదుగా లాల్‌బాగ్ వెస్ట్ గేట్ దాకా ర్యాలీ సాగింది. ఇదే సందర్భంగా అనిల్‌గుప్తా మాట్లాడుతూ రైతులు, సైనికులు, కార్మికులను ప్రతి రోజూ అందరం స్మరించుకోవాలన్నారు. జాతీయ భావాలు యువతలో పెంపొందింపచేయాలనే లక్ష్యంతోనే ఇటువంటి ప్రత్యేక ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు.



సమన్యాయంలో కోర్టుల పాత్ర కీలకం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ అంజారియా



బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అందరికీ సమాన న్యాయం కల్పించే విషయంలో కోర్టుల పాత్ర కీలకమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ అంజారియా తెలిపారు. గురువారం హైకోర్టు ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఎంతోమంది పోరాటాలు చేశారని, వారిని స్మరించుకోవాల్సి ఉందన్నారు. లభించిన స్వాతంత్ర్యం ద్వారా మనందరిపైనా బాధ్యత ఉందన్నారు. ప్రజలకు సామాజిక న్యాయం కల్పించడంలో న్యాయ వ్యవస్థ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం త్వరితగతిన న్యాయం లభించేందుకు లోక్‌అదాలత్ కీలకంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ సేవా కేంద్రాలు, వర్చువల్ కోర్టులు పెరగాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అదనపు సొలిసిటర్ జనరల్, అడ్వొకేట్ జనరల్, న్యాయవాదుల సంఘం ముఖ్యులు భాగస్వాములయ్యారు.

అబ్బుర పరచిన విన్యాసాలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మాణెక్ షా పరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో పథసంచలనం అబ్బురపరచింది. పరేడ్ కమాండర్ గోపాలరెడ్డి, డిప్యూటీ కమాండర్ హరీష్ హెచ్‌ఎన్ నేతృత్వంలో సరిహద్దు భద్రతా బృందం, కర్ణాటక రిజర్వు పోలీసు బెటాలియన్, పోలీసు బెటాలియన్, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ బెటాలియన్, గోవా పోలీసు బృందం, శ్వాన దళం, అబ్కారీ, సంచార, సివిల్ పోలీసులు, అగ్నిమాపక శాఖ, హోంగార్డులు, ఎన్‌సీసీ, నేషనల్ మిలటరీ స్కూల్, ఆర్మీ పబ్లిక్ స్కూల్, పోలీసు పబ్లిక్ స్కూల్, సమర్థనం, రమణశ్రీ అంధుల పాఠశాలల విద్యార్థులతో పాటు వివిధ విద్యాసంస్థల బృందాలు పథసంచలనంలో పాల్గొన్నాయి. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలకు సంబంధించి 400 మంది విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. యలహంక ప్రాంతానికి చెందిన 750 మంది విద్యార్థులు జయభారతి పాటకు నృత్యం చేయగా బీబీఎంపీ పిళ్లణ్ణ గార్డెన్ పీయూ కళాశాలలకు చెందిన 700 మంది విద్యార్థినులు స్వాతంత్ర్య పోరాట నేత్రి పేరిట చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మరాఠా లైట్ ఇన్‌ఫెంట్రీ రెజిమెంట్ సెంటర్ సైనికులు మల్లకంభ ప్రదర్శన, ప్యారాచూట్ రెజిమెంట్ ట్రైనింగ్ సెంటర్ సైనికుల మోటారు సైకిళ్ల ప్రదర్శనలు విశేషంగా అకట్టుకున్నాయి. ఇదే సందర్భంగా అవయవదానం చేసిన కుటుంబ సభ్యులను వేదికపైకి రప్పించి సీఎం సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు.









పోరాట యోధులను స్మరించుకోవాలి

- గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పిలుపు



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న గవర్నర్

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎంతోమంది ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటాలు చేశారని, అలాంటి యోధులందరినీ స్మరించుకోవాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పిలుపునిచ్చారు. గురువారం రాజ్‌భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత గవర్నర్ మాట్లాడుతూ కర్ణాటక ప్రగతిపథంలో ముందున్న రాష్ట్రమని, ఇక్కడి అభివృద్ధి దేశంలో అన్ని ప్రాంతాలకు స్ఫూర్తి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలు సామాన్య వర్గాలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నాయని అన్నారు. ప్రతి మనిషి పర్యావరణ రక్షణకు కట్టుబడాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. రాజ్‌భవన్ ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్, గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి పంకజ్‌మెహతాతో పాటు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఖడ్గంతో విద్యార్థి విన్యాసాలు


మరపురాని స్వాతంత్ర్య వేడుకలు

- కెనరాబ్యాంక్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణరాజు

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటున్నానని, కానీ తన జీవితంలో మరుపురాని వేడుకలు ఇవేనని భావిస్తున్నట్లు కెనరా బ్యాంక్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సత్యనారాయణరాజు తెలిపారు. బెంగళూరులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం జాతీయ జెండాను సీఎండీ ఆవిష్కరించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సహా ఉన్నతాధికారులు భాగస్వాములయ్యారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ప్రతిభావంత విద్యార్థులను ప్రోత్సహించేందుకు పారితోషికాలను ప్రారంభించామని తెలిపారు. దేశంలోని అన్ని బ్యాంకుల పరిధిలో కనీసం ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేశామని, ఇలా 44,700 మంది బాలికలకు రూ. 17.20 కోట్లు ఖాతాల ద్వారా నగదు బదిలీ చేశామని వెల్లడించారు. ఐదేళ్లుగా బ్యాంకులో కారుణ్య నియామకాలు పెండింగ్‌లో ఉండేవని, ఒకేసారి 150 మందిని నియమించుకున్నామని పేర్కొన్నారు. వయసుతో సంబంధం లేకుండా విద్యార్హతను బట్టి ఉద్యోగాలు కల్పించామని అన్నారు. బాల్యంలో తన చెల్లి, సోదరుడు లయన్స్‌క్లబ్ వంటి సంస్థల ప్రోత్సాహంతో చదివారని గుర్తు చేసుకున్నారు. 1995లో బ్యాంకులో ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏటా తమ గ్రామంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని వివరించారు. విధినిర్వహణలో భాగంగా తాను వెళ్లలేనని, అందుకే తమ అమ్మ ఆ బాధ్యతలు కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇలా సమాజంలో పేద, ప్రతిభావంతులకు సేవ చేసే అవకాశం దక్కినందుకు స్వాతంత్ర్య వేడుకలు ప్రత్యేకంగా భావిస్తున్నట్లు తెలిపారు. స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్‌ను రూ.45 కోట్ల నుంచి రూ.90 కోట్లకు అనుమతులు లభించాయని, ఉద్యోగులతో పాటు రిటైర్డ్ అయిన వారికి చేదోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి కారుణ్య నియామకపు పత్రాలను అందించారు. బెంగళూరు పరిధిలోని విద్యార్థులకు ప్రోత్సాహకాల చెక్కులను పంపిణీ చేశారు.




పేద విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.22	1,628.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	35,437	5,548
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,10,614	9,710
సామర్థ్యం (టీఎంసీలు)	77.21	88.68

ఆందోళనలో ఎత్తిపోతల పథకం రైతులు



మరియమ్మనహళ్ళి వద్ద ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌లు

బళ్లారి సిటీ,ఆగస్టు 15: విజయనగర జిల్లా పరిధిలోని మరియమ్మనహళ్ళి ఎత్తిపోతల పథకం క్రింద సాగు చేస్తున్న వందలాది మంది రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. తుంగభద్ర జలాశయం తుంగభద్ర డ్యామ్‌లో నీటిమట్టం 1620 అడుగులకు చేరుకున్న వెంటనే ఈ ఎత్తిపోతల పథకానికి నీరు వచ్చి చేరేదని, తద్వారా ఏడెనిమిది నెలల పాటు పొలాలకు నీరు అందడంతో రెండు పంటలు సాగు చేసేవారమని రైతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. అయితే క్రస్ట్ గేట్ కొట్టుకుపోవడంతో జలాశయంలో నీరంతా నది పాలుకావడంతో ఎత్తిపోతల పథకాన్ని నమ్ముకున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వ్యాసన కెర ఎత్తిపోతల పథకం క్రింద మొదటి, రెండవ విడత సుమారు 3వేల ఎకరాలకు నీరు సమకూరుతుండగా, డణాయకన చెరువుకు ఈ సారి భారీగా వరద నీరు చేరుతుందని రైతులు సంతోష పడ్డారు. అయితే ప్రస్తుతం క్రస్ట్‌గేట్ కొట్టుకపోవడంతో జలాశయంలో నీటిని ఖాళీ చేయాల్సిన పరిస్థితి నెలకొనడంతో రైతులకు దిక్కుతోచడంలేదు. జిల్లాలోని 30కిపైగా ఎత్తిపోతల పథకాలు పరిధిలోకి వచ్చే రైతులకు ఇదే పరిస్థితి ఎదురవుతోందని చిన్న నీటిపారుదల శాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జటింగి రామేశ్వర హైస్కూల్‌లో స్వాతంత్ర్య వేడుకలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

బళ్లారిరూరల్, ఆగస్టు 15: జటింగి రామేశ్వర హైస్కూలు ఆవరణలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా కరెస్పాండెంట్ చంద్రమూర్తి హెచ్ఎం శ్రీనాయక్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు దేశనాయకుల వేషధారణలతో అలరించారు. విద్యార్థులు నృత్యంచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రాజన్న, గాయత్రి, అమూల్యరాణి, సింధు, సనాజాస్మిన్, సుమిత్ర, విజయలక్ష్మీ, కీర్తి నందిని తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి



త్రిచక్రవాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఆగస్టు 15 : ప్రభుత్వాలు పేద కుటుంబాల వారికి ఇచ్చే సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కంప్లి ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. కంప్లి పట్టణంలో గురువారం కంప్లి నియోజకవర్గంలోని 15 మంది దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా కంప్లి నియోజకవర్గంలో దివ్యాంగులను, పేద కుటుంబాల వారిని గుర్తించి వారికి త్రిచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత యేడాది కూడా 20 మందికి పైగా పంపిణీ చేశామని, ఈ యేడాది 15 మందికి పంపిణీ చేశామన్నారు. ఇచ్చిన వాహనాలను కేవలం దివ్యాంగులు మాత్రమే సద్వినియోగం చేసుకోవాలని కుటుంబసభ్యులు వారి పనులకు ఈ వాహనాలను ఉపయోగించరాదని తెలిపారు.




మ్యూజియాన్ని తిలకిస్తున్న మంత్రి

మ్యూజియం నిర్వహణ భేష్

బళ్లారి సిటీ, ఆగస్టు 15 అనేక వస్తువులతో కూడిన రాబర్ట్ బ్రూస్ ఫుట్ సంగన కల్లు మ్యూజియం నిర్వహణ చక్కగా ఉందని దేవాదాయ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ అభినందించారు. ఆయన గురువారం నగరంలోని డా.రాజ్‌కుమార్ రోడ్డులోనిమ్యూజియాన్ని సందర్శించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ ఈ ఆర్కియాలజీ మ్యూజియంలో పురాతన శిలాయుగం, నియోలిథిక్ యుగంలో రాతి పనిముట్లకు సంబంధించిన విశిష్టమైన చరిత్ర సమాచారం ఉందన్నారు. రాతియుగంపై దృష్టి సారించే మ్యూజియం ఇదొక్కటేనని తెలిపారు.

త్యాగాలతోనే స్వాతంత్ర్యం

జాతీయ జెండా ఆవిష్కరణలో మంత్రి కృష్ణబైరేగౌడ





జెండాకు వందనం చేస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ తదితర ప్రముఖులు

బళ్లారి సిటీ,ఆగస్టు 15: స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలతో సాధించిన స్వాతంత్ర్యానికి గుర్తుగా జరుపుకునే ఉత్సవాలు దేశంలోనే కుల, మతాలకు అతీతంగా జరుపుకునే పండుగలని దేవదాయ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ అన్నారు. నగరంలోని విమ్స్‌మైదానంలో గురువారం బళ్లారి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఎందరో మహాయోధులను, వేలాది మంది వీరజవాన్లను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యమన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో జిల్లా సహకారం అపారం

కర్ణాటకలోని బళ్లారి జిల్లా స్వాతంత్ర్య పోరాటంలో తనదైన గొప్ప కృషి చేసిందని, స్వాతంత్ర్య పోరాటంలో దూకిన ఎందరో పోరాటయోధులను కన్నడ, తెలుగు ప్రజలు స్మరించుకోవాలన్నారు. ఇక్కడి ద్విభాషా సంస్కృతి విశిష్టమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. 1947లో ఒక్క సూదిని కూడా తయారీ చేసే శక్తి భారత్‌కు లేదని, ఆ తర్వాత తన దార్శనికత ద్వారా నెహ్రూ నవ భారతాన్ని నిర్మించారన్నారు. వరుస రాకెట్లను ప్రయోగించి ప్రపంచంలోని అభివృద్ధి దేశాలకు సవాలు విసిరిన ఇస్రో వంటి సంస్థ నేడు అంతరిక్ష రంగంలో సరికొత్త విజయాన్ని సాధించిందన్నారు. సమాజంలోని అత్యంత అట్టడగున ఉన్న ప్రజలకు ఆర్థిక, రాజకీయ, విద్యా సామాజిక సమానత్వం కల్పించేందుకు డాక్టర్, బి.ఆర్, అంబేద్కర్ చేసిన పోరాటం ప్రపంచ పోరాట చరిత్రలో ఒక మైలురాయి అన్నారు. నెహ్రూ. అంబేద్కర్ లాంటి నాయకులను అర్థం చేసుకోవాలని యువతకు విజ్ఞప్తి చేశారు. సమాజంలోని సంపదను పేదలకు అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కష్టపడి సంపాదించిన సొమ్మును పేదలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు ముఖ్యమైన హామీలను అమలు చేసిందన్నారు. ఈసందర్భంగా సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, విధానపరిషత్ యం.సతీశ్, ముండరిగి నాగరాజు, మేయర్ ముల్లంగి నందీశ్ బాబు డిప్యూటీమేయర్ సుకుమ్, బుడా అధ్యక్షుడు ఆంజనేయులు, జోనల్ ఇన్‌స్పెక్టర్ లోకేశ్, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా ఎస్పీ శోభరాణి, జిల్లాపంచాయితీ రాహుల్ శరణప్ప, ఫారెస్ట్ నందీప్ సూర్యవంశీ, అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బళ్లారి నగరంలో అన్న క్యాంటీన్ ప్రారంభం



అన్నం వడ్డిస్తున్న ఎన్‌టీఆర్ అభిమానులు

బళ్లారి సిటీ, ఆగస్టు 15: బళ్లారిలోని విమ్స్ అనుబంధంగా ఉండే ట్రామాకేర్ ఆసుపత్రి ఆవరణలో గురువారం టీడీపీ అభిమానులు ఎన్‌టీఆర్ అన్నక్యాంటీన్‌ను ప్రారంభించారు. గుర్రం లాల్‌మోహన్, ప్రభాకర్‌నాయుడు, చింబ్లి ప్రకాష్‌నాయుడు. పనిందర్ కార్పొరేట్ విక్కీ, తదితరుల ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఆసుపత్రికివచ్చే రోగులకు, అలాగే వారి బంధువులకు, ఆసుపత్రిలో నిరంతరం డ్యూటీ చేస్తున్న నర్సులు, సిబ్బందికి ఇక్కడ అన్నక్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తారని తెలిపారు. ఇది నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

మురిసిన మువ్వన్నెల జెండా

ఊరువాడా స్వాతంత్ర్య వేడుకలు



జాతీయ నాయకులకు నివాళి అర్పిస్తున్న అల్లం ప్రశాంత్



ఆర్టీవో చెక్‌పోస్టు ఆవరణలో ....



మాట్లాడుతున్న సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు



జటింగి రామేశ్వర పాఠశాల ఆవరణలో..



జిందాల్ విమానాశ్రయంలో స్వాతంత్ర్య వేడుకలు



కంప్లి షుగర్ ఫ్యాక్టరీలోని ప్రాథమిక పాఠశాలలో..



ఒడ్డు గ్రామంలో స్వాతంత్ర్య వేడుకలు



జెండాను ఎగురవేస్తున్న సిరుగుప్ప తహసీల్దార్ విశ్వనాథ్

బళ్లారి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. తాలుకాలోని పీడీహళ్లి, హగరి తదితర ప్రాంతాల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీవో చెక్‌పోస్టు గ్రామ పంచాయతీ కార్యాలయాలో జెండాపండుగను ఘనంగా నిర్వహించారు. సిరుగుప్పలో కూడా స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. సిరుగుప్ప పట్టణ హైస్కూలు గ్రౌండ్‌లో జాతీయ జెండాను తహసీల్దార్ విశ్వనాథ్ ఎగుర వేశారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఎల్‌కేజీ, యుకేజీ పాఠశాల విద్యార్థులకు యూనిఫారమ్‌లను అందజేశారు. విద్యార్థులు దేశభక్తిని చాటే గ్రూపు డ్యాన్స్‌లు చేశారు. కంప్లి, కురుగోడు, కుడితిని, వడ్డు, బండట్టి, విజయనగర విమానాశ్రయం తదితర ప్రాంతాల్లో స్వాతంత్ర్య వేడుకలను వైభవంగా నిర్వహించుకున్నారు. వడ్డులో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నింగమ్మ నాగరాజు, ఉపాధ్యక్షురాలు పార్వతి మల్లయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే బండట్టి గ్రామంలో అధ్యక్షులు జగదీష్, ఉపాధ్యక్షులు జయమ్మ ఉలిగేష్, విజయనగర జిందాల్ విమానాశ్రయంలో డైరెక్టర్ టీఎస్ గౌడ జెండాను ఎగురవేశారు. కంప్లి పట్టణంలో తహసీల్దార్ శివరాజ్, కురుగోడులో ఎమ్మెల్యే గణేష్, తహసీల్దార్ రాఘవేంద్రలు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విజయ విఠల దేవస్థానం వద్ద మండపాలను మూడు రంగులతో అలంకరించారు.

దేశ హితం కోసం కలిసి పనిచేద్దాం

జిల్లా న్యాయసేవల ప్రాధికార అధ్యక్షురాలు శాంతి

బళ్లారి సిటీ, ఆగస్టు 15: మహత్తరమైన భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సంఘటితమై కృషిచేయాలని జిల్లా స్పెషల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవల ప్రాధికార అధ్యక్షులు కేజీ శాంతి పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్ర్య ఉత్సవాల్లో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, బళ్లారి బార్ అసోషియేషన్, జిల్లా జ్యూడీషియల్ ఎంప్లాస్‌యీ అసోసియేషన్, ఆటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని నూతన జిల్లాకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు.



కోర్టు ఆవరణలో మొక్కను నాటి నీరు పోస్తున్న న్యాయాధికారి శాంతి

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్. అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్‌పాటిల్, జవహార్‌లాల్‌నెహ్రూ, లాల్‌బహద్దూర్ శాస్త్రీ, లాల్ లజపతిరాయ్, భగత్‌సింగ్, ఝాన్సీ రాణి లక్ష్మీబాయి. సరోజినీ నాయుడు తదితరులను స్మరించుకోవాలన్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆలోచన చేస్తూ సమాజానికి మంచి సహకారం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మనది అనే మనలోని స్వీయ వ్యక్తిత్వాన్ని తిప్పికొట్టాలన్నారు. సురక్షితమైన దేశాన్ని నిర్మించాలనే ధృడ సంకల్పంతో దేశ భద్రత కోసం పెట్టుబడులు పెట్టాలన్నారు. సాతంత్ర్యదినోత్సవ వేడుకలను కేవలం లాంఛన ప్రాయంగా పెద్దలకు మాత్రమే పరిమితం చేయకుండా దేశాభివృద్ధి కోసం ఆలోచించాలన్నారు.

తల్లిపేరుమీద మొక్కను నాటాలని, అడవిని తల్లిలాగా పెంచి కాపాడుకోవాలని అన్నారు. సీనియర్ రిటైర్డ్ న్యాయవాది, శాసనమండలి మాజీ ఎమ్మెల్యే తిప్పన్న మాట్లాడుతూ తన వృత్తి గత స్మృతులను నెమరువేసుకుంటూ అనుభవపూర్వకంగా పనితీరును వివరించారు. ఇదే సందర్భంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాన్యాయసేవల సంస్థ సెక్రటరీ రాజేశ్ హొసమనె, అసోసియేషన్ అధ్యక్షులు రామబ్రహ్మ, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లు, న్యాయమూర్తులు, సిబ్బంది, ఆటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత

బళ్లారి సిటీ,ఆగస్టు 15: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆర్గనైజేషన్ బళ్లారి బ్రాంచ్, విమ్స్ అండ్ గోల్డ్ అండ్ సిల్వర్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఫ్లవర్ మార్కెట్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌సంస్థ కార్యదర్శి షకీబ్ మాట్లాడుతూ యువకులు రక్తదానం చేసేలా ప్రొత్సహించాలన్నారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ బ్లడ్ డొనేషన్ సబ్ కమిటీ ఛైర్మన్ బ్లడ్ దేవన్న, గోల్డ్ అండ్ సిల్వర్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జావేద్, షబ్బీర్, చిట్టిబాబు, జీలాన్ భాషా, కుబేర బాషా, శరణ్, విజయ్‌కుమార్, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 50మందికిపైగా రక్తదానం చేశారు.

హోసూరు జోన్

సహపంక్తి భోజనం ఏర్పాటు



ప్రజలతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు 15: కృష్ణగిరి పంచాయతీ యూనియన్ కాటినాయనపల్లి ఆంజనేయ, సుబ్రహ్మణి స్వామి ఆలయాల్లో స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సరయు ప్రజలతో కలిసి భోంచేశారు.

పూనపల్లి పంచాయతీలో గ్రామసభ

హోసూరు ఆగస్టు 15 : హోసూరు పంచాయతీ యూనియన్ పరిదిలోని పూనపల్లి పంచాయతీలో ప్రభుత్వ ఆదేశం మేరకు గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామసభ సమవేశం నిర్వహించారు. దీనికి పంచాయతీ అధ్యక్షుడు భైరప్ప సావిత్రమ్మ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సరస్సులో ఆక్రమణ తొలగింపు, ప్రైవేటు సంస్థల పన్నుల వసూళ్ళ, ప్రజల కనీస అవసరాలైన తాగునీటి సరఫరా, పాఠశాలల్లో విద్యార్థులకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడంతో పాటు పలు తీర్మానాలను ఆమోదించారు. మండల పీడీఓ రామన్, సహాయ వ్యవసాయ అధికారి సుందరరాజ్, పూనపల్లి పంచాయతీ వీఏవో ఆనంద్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో పంచాయతీ సమావేశం

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు15: కృష్ణగిరి జిల్లా శూలగిరి పంచాయతీ యూనియన్, ఇమ్మిడినాయకనపల్లి పంచాయతీ, బెట్టపల్లి గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ కె.ఎం.సరయు అధ్యక్షతన గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ పరిపాలన ఖర్చు , స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, ఆన్‌లైన్ పన్ను చెల్లింపు సేవ, ఆన్‌లైన్ ప్లాట్ డివిజన్ బిల్డింగ్ పర్మిషన్, తక్షణ రిజిస్ట్రేషన్ ద్వారా నివాస భవనాలకు అనుమతి ఇవ్వడం గురించి జల్‌జీవన్ ఉద్యమం గురించి చర్చించారు. మన జిల్లాలో బాల్య వివాహాలు నిరోధించి స్త్రీవిద్యను ప్రోత్సాహించాలని తీర్మానించారు. ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వం 6వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన బాలికలకు నెలకు రూ.1000 అందిస్తోందని, తద్వారా తమ అమ్మాయిలను ఉన్నత చదువులు చదివించేలా చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు మహదేవన్, అధికారి శరవణన్, జిల్లా అభివృద్ధి అధికారులు మురుగన్, ఉమా శంకర్, పంచాయతీ కౌన్సిల్ ప్రెసిడెంట్ మాల్యన్, రెవిన్యూ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో వేడుకలు

హోసూరు ఆగస్టు 15 : హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రియాంక జాతీయ జెండాను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. తర్వాత ఐదుగురికి ప్రమాద పరిహారం అందజేశారు. రెవిన్యూ శాఖల్లో అత్యుత్తమంగా పనిచేసిన 70 మందికి సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందించారు. ఈకార్యక్రమంల్లో పెద్ద సంఖ్యల్లో రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న అధికారులు

పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి

● రాష్ట్ర వైద్యవిద్య శాఖ మంత్రి డాక్టర్ శరణుప్రకాశ్ పాటీల్



జాతీయ జెండాకు వందనం చేస్తున్నమంత్రి శరణుప్రకాశ్ పాటీల్

రాయచూరు, ఆగస్టు 15 : పేదల బ్రతుకుల్లో వెలుగును నింపాలన్న ఉద్దేశంతోనే తాము పని చేస్తున్నామని ఇందుకోసమే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్యవిద్య శాఖ మంత్రి డాక్టర్ శరణుప్రకాశ్ పాటీల్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఐదు గ్యారెంటీలు ఓట్ల వేట లో భాగం కాదని కేవలం బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని మహాత్మగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని జాతీయ పతకాన్ని ఎగరవేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, దేశంలో స్వాతంత్ర్యనంతరం దశలవారి అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రణాళికాబద్ధంగా చేసిన కృషిని ఆయన వివరించారు. దాంతో పాటు రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన అనంతరం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల ఆశీర్వాదంతోనే తాము అధికారంలోకి వచ్చామని ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఇచ్చిన ఐదు గ్యారెంటీలను అమలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మాగాంధీ మొదలుకొని అనేక మంది అమరజీవులు చేసిన త్యాగాలే నేడు అనుభవిస్తున్నామని వారికి స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు.

ప్రమాదంలో మహిళ మృతి

రాయచూరు, ఆగస్టు 15: నగరంలోని ఆశాపూర్ రోడ్డు జనతా కాలనీకి చెందిన తాయమ్మ (32) అనే మహిళ ఎక్స్‌కవేటర్ మట్టి తొలగిస్తుండగా ఆ మట్టి కింద పడి మృత్యువాతపడింది. ఈ సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకోగా సంఘటన స్థలాన్ని పరిశీలించిన వెస్ట్ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఖాళీగాఉన్న స్థలంలో కంపచెట్ల ప్రాంతంలోకి కాలనీకి చెందిన మహిళలు బహిర్భూమికి వెళ్లడం అలవాటుగా ఉండగా అదే క్రమంలో బహిర్భూమికి వెళ్లిన మహిళపై సమీపంలోనే ఎక్స్‌కవేటర్ తొలగిస్తున్న మట్టి పడింది. డ్రైవర్ సమీపంలోని ఓ భవనం శిథిలమైన గోడలు తొలగిస్తూ, పక్కన కంపచెట్లలో మహిళ ఉన్న విషయం గమనించకుండా మట్టిని ఆమెపైకి కుమ్మరించాడు. దీంతో ఆమె ఊపిరాడక అక్కడికక్కడే మృత్యువాతపడింది. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసిన వెస్ట్ పోలీస్ స్టేషన్ పోలీసులు జేసీబీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

రామకృష్ణ పరమహంస (వర్ధంతి)



ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రామకృష్ణ పరమహంస 1836 ఫిబ్రవరి 18న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లా కామార్పుకూర్‌లో జన్మించారు. అసలుపేరు గదాధర్ ఛటోపాధ్యాయ. 19, 20వ శతాబ్దాలలో పశ్చిమబెంగాల్‌లో ఆధ్యాత్మిక విప్లవం తెచ్చారు. కాళికాదేవి భక్తుడు. రామకృష్ణ మఠం, మిషన్‌ను స్థాపించి దేశవ్యాప్తంగా ప్రజలలో విద్య, సామాజిక, ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు కృషి చేశారు. సమాజంలో పేరుకున్న మూఢనమ్మకాలను తొలగేందుకు పాటుపడ్డారు. స్వామి వివేకానంద ఆయన ప్రధాన శిష్యుడు. తన 50వ యేట 1886 ఆగస్టు 16న పరమపదించారు.

అటల్ బిహారీ వాజపేయి (వర్ధంతి)



భారతరత్న గ్రహీత, దేశం గర్వించదగిన నాయకులలో అటల్ బిహారీ వాజపేయి ఒకరు. 1924 డిసెంబరు 25న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జన్మించారు. బీజేపీ నుంచి దేశ ప్రధానిగా వ్యవహరించి అజాతశత్రువుగా పేరొందారు. కవిగా, రచయితగా రాణించారు. దేశ అత్యున్నత 'భారతరత్న', పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. నాలుగు దశాబ్దాలపాటు వివిధ హోదాలలో కొనసాగి 1994లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారు. ఆయన పుట్టినరోజును గుడ్ గవర్నెన్స్ డేగా ప్రకటించారు. 2018 ఆగస్టు 16న కన్నుమూశారు.

వానమామలై వరదాచార్యులు (జయంతి)



బహుభాషా పండితుడు, రచయిత వానమామలై వరదాచార్యులు 1912 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మండికొండలో జన్మించారు. 13వ యేటనే పద్యరచన ప్రారంభించి 64కు పైగా రచనలు చేశారు. ఆయన రచనలలో 'మణిమాల' ఎంతో పేరొందింది. ఉపాధ్యాయుడిగా, ఎమ్మెల్సీగా వ్యవహరించారు. పోతన జీవితమే ఆదర్శంగా సాగి 'అభినవ పోతన'గా గుర్తింపు పొందారు. బెనారస్‌లోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. ఆంధ్ర ఉత్ప్రేక్ష చక్రవర్తి, మహాకవి శిరోమణి బిరుదులు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. 1984 అక్టోబరు 31న కన్నుమూశారు.

అరవింద్ కేజ్రీవాల్ (పుట్టినరోజు)



ప్రముఖ రాజకీయ నాయకుడు, 2015 నుంచి ప్రస్తుతం ఢిల్లీ 7వ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న అరవింద్ కేజ్రీవాల్ 1968 ఆగస్టు 16న హర్యానాలో జన్మించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. రాజకీయాలలోకి రాకమునుపు ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌లో చేరి జాయింట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్‌ట్యాక్స్‌గా వ్యవహరించారు. ఆయన నాయకత్వాన్ని గుర్తించి 'రామన్ మెగసెసె పురస్కారం' అందుకున్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ పట్టా పొందారు. పలు గౌరవాలు, పురస్కారాలు అందుకున్నారు. 2014లో టైమ్స్ జాబితాలో 100లో పు టాప్‌మోస్ట్ ప్రభావిత వ్యక్తులలో ఒకరుగా నిలిచారు.

సైఫ్ అలీఖాన్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ప్రముఖ హిందీ నటుడు సైఫ్ అలీఖాన్ 1970 ఆగస్టు 16న న్యూఢిల్లీలో జన్మించారు. క్రికెట్ మాజీ కెప్టెన్ మన్సూర్ అలీఖాన్ పటౌడి కుమారుడు. నటుడిగానే కాక నిర్మాతగా రాణించారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. నేషనల్ ఫిల్మ్ అవార్డు, 6 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు ఇతర అవార్డులు అందుకున్నారు. స్టేజ్ షో పర్‌ఫార్మర్‌గాను, బుల్లితెరపైనా తన సత్తా చాటుకున్నారు.

చెన్నపట్టణ నుంచి నేనే పోటీచేస్తా

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్టణ ఉప ఎన్నిక ఎప్పుడు జరిగినా తానే అభ్యర్థి అవుతానని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. గురువారం నెలమంగళలో వీరభద్ర ఆలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రామ గర్‌లో ఐదేళ్లుగా పతాకాన్ని ఎగురవేస్తున్నట్లు తెలిపారు. గ్యారెంటీలపై పరిశీలించాలని మంత్రులెవరూ వ్యాఖ్యానించలేదని, కానీ అవసరం లేని వారికి నిలుపుదల విషయమై మాత్రమే మాట్లాడారని తెలిపారు. చెన్నపట్టణకు తానే అభ్యర్థిని అంటూ మరోసారి బాంబు పేల్చారు. గతంలోనూ ఇదే తరహాలో మాట్లాడిన మేరకు తీవ్రమైన విమర్శలు వచ్చాయి. చెన్నపట్టణలో స్వాతంత్ర్య వేడుకల్లో ఉదయం పాల్గొన్న డీసీఎం శివకుమార్‌తో పాటు బీజేపీలో అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ భాగస్వామ్యులయ్యారు. బీజేపీలో టిక్కెట్ దక్కకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని సవాల్ చేసిన యోగేశ్వర్ భవిష్యత్‌లో పార్టీ మారుతారా అనేది చర్చనీయాంశమవుతోంది.

92 మందికి కంటి ఆపరేషన్లు

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కియా మోటార్స్ సంచార వాహనం ద్వారా పాటు మంజునాథ కంటి ఆసుపత్రి ముఖ్యులు మంజునాథ్ ఆధ్వర్యంలో 92 మందికి కంటి ఆపరేషన్‌లు చేశారు. ఈమేరకు డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ ప్రభాకర్ గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో నిరుపేద వృద్ధులకు కంటి చికిత్సలు చేశామన్నారు. కంటి చికిత్సల పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. అధునాతన చికిత్సా విధానాలు వచ్చాయని సమస్య తలెత్తిన వెంటనే నిపుణులైన డాక్టర్ల సలహాలతో చికిత్సలు పొందాలన్నారు. ఆపరేషన్‌లు చేయించుకున్నవారికి ఉచితంగా మందులు, అద్దాలను పంపిణీ చేశారు.



ఆపరేషన్లు చేయించుకున్న వారితో వైద్యులు,సిబ్బంది

మువ్వన్నెల జెండా రెపరెపలు



స్వాతంత్ర్య వేడుకల్లో యూనియన్ బ్యాంకు ఉద్యోగులు, మణిపాల్ ఆసుపత్రిలో ప్రముఖులు, శ్రీకృష్ణ గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో ముఖ్యఅతిథికి సన్మానం, చింతామణిలో తహసీల్దార్ సుదర్శన్‌యాదవ్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినం సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు వివిధ సంస్థల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సంబరాలు అంబరాన్నంటాయి.యూనియన్ బ్యాంక్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం బెంగళూరు ఉత్తర విభాగం ఆధ్వర్యంలో మల్లేశ్వరంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడకలు అర్థవంతంగా జరిగాయి. బ్యాంకు బెంగళూరు జోనల్‌హెడ్ నవనీత్‌కుమార్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెంగళూరు ఉత్తర విభాగం రీజియన్ ముఖ్యులు రాజేందర్‌కుమార్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు అవయవదానానికి ప్రతిజ్ఞ చేయాలని మణిపాల్ ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ హెచ్ సుదర్శన్ బల్లాళ్ పిలుపునిచ్చారు. అవయవదానం ఆశవ్యకతను వివరిస్తూ ఇదే నిజమైన స్వాతంత్ర్య చైతన్యమన్నారు. నగరంలోని ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని మణిపాల్ ఆసుప త్రి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు అర్థవంతంగా ఆచరించారు. అవయవదానంతో నలుగురి ప్రాణాలు కాపాడిన, 1947 నాటి స్వాతంత్ర్యాన్ని చూసిన సీనియర్ ప్రముఖులు నాగరాజ్‌ను గుర్తు చేసుకున్నారు. కోలారుకు చెందిన 59ఏళ్ల రైతు నాగరాజ్‌కు ఇంట్రాక్రేనియల్ హెమరేజ్ సమస్య ఉండేది ఇది చివరకు బ్రెయిన్‌డెడ్‌గా మారింది. దీంతో కుటుంబీకులు అవయవదానానికి అంగీకరించారు. వారి నిస్వార్థసేవతో నలుగురి జీవితాల్లో వెలుగు సాధ్యమైందన్నారు. ఆయన కుమారుడు సునిల్‌కుమార్, వారి కుటుంబీకులను ప్రశంసించారు. నగరంలోని బనశంకరిలోగల శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథిగా ఎయిర్‌ఫోర్స్ మాజీ వింగ్ కమాండర్ కేజీ రావ్ ప్రసంగిస్తూ విద్యారంగంలో ఎంతో ప్రగతి సాధించామని ప్రస్తుత పోటీ యుగంలో గుర్తింపు పొందాలంటే డాక్టర్, ఇంజనీర్‌ల ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యాసంస్థల సంస్థాపక అధ్యక్షుడు ఎం.రుక్మాంగదనాయుడు అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షులు జలజాక్షమ్మ, కళాశాల డైరెక్టర్ మనోహర్, పీజీ విభాగం డైరెక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ కమలా సుగంధి, పీయూ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎన్. ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో: జాతీయపండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఝాన్సీరాణి లక్ష్మీబాయి క్రీడామైదానంలో స్వాతంత్ర్య దినోత్సవం సంబరంగా సాగింది. జాతీయ పతాకాన్ని తహసీల్దార్ సుదర్శన్ యాదవ్ ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం కోసం మహనీయుల సాధనలు, త్యాగాలను గుర్తు చేశారు. స్వాతంత్ర్యం లభించి దశాబ్దాలు గడిచినా ఐకమత్యం లోటు కారణంగా అణగారినవర్గాలలో ఆశించిన అభివృద్ధి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలు తమ హక్కులు సాధించుకోవాలన్నారు. నగరసభ కమిషనర్ చలపతి మాట్లాడుతూ తాలూకాను ప్లాస్టిక్ రహితగా తీర్చిదిద్దేందుకు తీర్మానించామని ప్రజలు సహకరించాలన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ, పోలీసు, హోంగార్డుల పథసంచలనం ఆకట్టుకుంది. రాష్ట్రపతి సేవా పురస్కారానికి ఎంపికైన డీఎస్పీ మురళీధర్‌ను తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో సత్కరించారు.

విజయపురలో: దేశానికి స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలు దాటినా స్వావలంబన సాధించలేకపోయామని, ప్రతి ఒక్కరూ మరొకరి సాయం కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొందని ప్రజలలో మార్పురావాలని బసవకల్యాణ మఠాధిపతి మహదేవస్వామిజీ తెలిపారు. దేవనహళ్లి తాలూకా విజయపురలోని ప్రభుత్వ పీయూ కళాశాల క్రీడామైదానంలో పురసభ ఆధ్వర్యంలో అన్ని పాఠశాల, కళాశాలల సహకారంతో ఏర్పాటైన స్వాతంత్ర్య దినోత్సవానికి సాన్నిధ్యం వహించారు. ఎందరో మహనీయుల పోరాటాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించిందని పురసభ ముఖ్యాధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. జాతీయపతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థుల గౌరవవందనం స్వీకరించారు. వివిధరంగాల సాధకులను సత్కరించారు. చిన్నారుల వేషధారణలు అలరించాయి. పురసభ మాజీ అధ్యక్షులు రాజేశ్వరి భాస్కర్, నారాయణస్వామి, ఆర్ సుష్మా, శ్రీరాము, రాజణ్ణ, శిల్ప అజిత్, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

మహదేవపురలో: భారతీయ సంస్కృతి పరంపరకు ఎంతో ఘనత ఉందని, దాన్ని వీడి విదేశీ సంస్కృతి మోజులో యువత చిక్కుకుందని బెంగళూరు తూర్పు తాలూకా దండాధికారి రాజీవ్ పేర్కొన్నారు. కేఆర్‌పుర ఫస్ట్‌గ్రేడ్ కళాశాల మైదానంలో తాలూకా యంత్రాంగం ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, వాట్సప్‌లకు సమయం కేటాయిస్తూ స్మార్ట్‌ఫోన్‌లో యువత మునిగిపోయారన్నారు. చదువుపై సక్రమంగా దృష్టి సారించలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. బీఈఓ గోవిందప్ప, ఈఓ వసంతకుమార్, జేసీ దాక్షాయిణి, పాలికె నామినేటడ్ మాజీ సభ్యుడు ఆంటోనిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో : మన దేశభక్తికి ప్రతీకగా త్రివర్ణపతాకం ఉందని ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. తాలూకాలోని కారహళ్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ దేశభక్తినాయకుల వేషధారణతో ఆకట్టుకున్నారు. గ్రామపంచాయతీ అధ్యక్షుడు నారాయణస్వామి, మాజీ ఉపాధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్, కృష్ణ, మంజునాథ్, ప్రధానోపాధ్యాయురాలు శాంతమ్మ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహళ్లిలో : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్ సోమసుందరపాళ్య చిన్మయస్కూల్ అండ్ కాలేజ్‌లో వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. చిన్మయ విద్యాసంస్థల చైర్మన్ వాసుదేవరెడ్డి పతాకావిష్కరణ చేశారు. ఎందరో మహనీయుల పోరాటం, త్యాగం ఫలితంగా స్వాతంత్ర్యం లభించిందన్నారు. సుదీర్ఘపోరాటం అనంతరం మనకు స్వాతంత్ర్యం దక్కిందన్నారు. స్వాతంత్ర్యం లభించి దశాబ్దాలు గడిచినా కొన్ని సరిహద్దుల్లో పొరుగుదేశాలు కయ్యానికి కాలుదువ్వుతుండగా మిలిటరీ సమర్థవంతంగా ఎదుర్కొంటోందన్నారు. మీరుకూడా చక్కగా చదివి ఇష్టమైన రంగాల్లో ఉన్నతహోదాలలో నిలిచి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల డైరెక్టర్లు రంజిత్, ప్రజ్వల్, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు. ఇదే సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంగమ్మనపాళ్యలోని ఎంఆర్ఆర్ స్కూల్‌లో చైర్మన్ రాజేంద్ర జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. షిర్డీసాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ పతాకావిష్కరణ చేశారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. రామకృష్ణ మాట్లాడుతూ 12 ఏళ్లుగా క్రమం తప్పకుండా స్వాతంత్ర్య దినోత్సవం ఆచరిస్తున్నామన్నారు. దేశ స్వాతంత్ర్యకోసం పోరాడిన నేతలను స్మరించుకున్నారు. ఆలయంలో సామాజిక సేవల్లో వైద్యసేవల్లో భాగంగా రక్తదాన సేవలకు ఎన్నారై శివప్రసాద్ మేడా తరపున సాయి సేవా రక్షా ఫౌండేషన్‌కు ఆమె తల్లి నాగరత్నమ్మ రూ.81వేలు అందచేశారు. అత్యవసరంలో ఉన్నవారికి ట్రస్టు తరపున ఉచితంగా రక్తం సమకూర్చనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా లడ్డూలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ పదాధికారులు తాతయ్యగుప్త, మనోహర్ గుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్‌గుప్త, సత్యనారాయణశెట్టి, వలంటీర్లు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో : ఎంతోమంది పోరాటవీరులు, మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం దక్కిందని, వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ ఆవరణలో జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా 11 ఏళ్లుగా ఉన్నానని, ప్రజల ఆశీర్వాదంతోనే సాధ్యమైందన్నారు. పరిశ్రమలు, శాశ్వత నీటికోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తాలూకా పంచాయతీ ఈఓ జీవీ రమేశ్, బీఈఓ వెంకటేశప్ప, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ధి, పురసభ స్థాయి సమితి అధ్యక్షుడు నంజుండప్ప, అధికారులు పాల్గొన్నారు.

చేళూరులో : చేళూరు పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు జాతీయపతాకాలతో ఊరేగారు.



చింతామణిలో రాష్ట్రపతి సేవా పతకం విజేత డీఎస్పీ మురళీధర్‌కు సన్మానం



విజయపురలో గౌరవవందనం స్వీకరిస్తున్న పురసభ ముఖ్య అధికారి సంతోష్‌కుమార్



వేదికపై బసవకల్యాణ మఠాధిపతి స్వామిజీ తదితరులు



బంగారపేట తాలూకాలో స్వాతంత్ర్య వేడుకలు



కేఆర్‌పురలో జాతీయపతాకాలతో విద్యార్థులు



మంగమ్మనపాళ్య ఎంఆర్ఆర్ పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకలు



సోమసుందరపాళ్య చిన్మయ పాఠశాలలో పతాకావిష్కరణ



శాంతిధామ వద్ద జాతీయపతాకావిష్కరణ



బాగేపల్లి స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు



250 అడుగుల జాతీయ జెండా ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ తేజస్వీ సూర్య

స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ త్యాగాలు ఎనలేనివి : డీసీఎం

బెంగళూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చేసిన త్యాగాలు ఎనలేనివని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. సీఎం సిద్దరామయ్యతోపాటు పార్టీ పదాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆరున్నర లక్షలమంది కాంగ్రెస్ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారన్నారు. బ్రిటీష్‌వారితో చేతులు కలిపినవారు దేశభక్తి పాఠాలు చెప్పడం దుర్మార్గమని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడినవారు కాంగ్రెస్‌వారు అని చెప్పుకోవడం గర్వకారణమన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ క్విట్ ఇండియా ఉద్యమం నిలుపుదల చేయాలని బ్రిటీష్‌వారికి లేఖ రాశారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు కావడం సంతోషకరమన్నారు.

పోరాటనేతల స్మరణ అందరి బాధ్యత

దేశ స్వాతంత్ర్యం పోరాడిన నేతలను స్మరించుకోవడం అందరి బాధ్యతని ఎంపీ పీసీ మోహన్ అభిప్రాయపడ్డారు. మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణ స్వామి, పార్టీ జాతీయ సంఘటనా కార్యదర్శి బీఎల్ సంతోష్, నేతలు భగవంత్‌ఖూబా, రవికుమార్, భారతిశెట్టి పాల్గొన్నారు.

గ్యారెంటీలపై ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ : నిఖిల్

లోక్‌సభ ఎన్నికల వేళ ఎక్కువసీట్లు రాకుంటే గ్యారెంటీ పథకాలు నిలిపివేస్తామని చెప్పారని ప్రస్తుతం అదే తరహాలోనే ప్రజలను బ్లాక్‌మెయిల్ చేస్తోందని జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ మండిపడ్డారు. జేడీఎస్ కార్యాలయం జేపీ భవన్‌లో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలవేళ కాకాపాటిల్‌కు ఫ్రీ, మహదేవప్పకు ఫ్రీ అంటూ దీమా వ్యక్తం చేసి ప్రస్తుతం పరిష్కరించాలని తెలిపారని కొత్త అంశాన్ని తెరపైకి తెస్తున్నారన్నారు. ఎమ్మెల్సీలు శరవణ, తిప్పేస్వామి, మాజీ మంత్రి లీలాదేవి, పార్టీ ప్రముఖులు ప్రకాశ్, నారాయణరావ్ పాల్గొన్నారు.



పీసీసీ కార్యాలయంలో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో కలసి వస్తున్న దృశ్యం